క్లుప్తంగా

బొడ్రాయికి ప్రత్యేక పూజలు



మండల పూజలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని మామిడిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి విగ్రహ మండల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం గణపతి హోమం, పుణ్యాహవచనం, పాల, పుష్ప, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గ్రామ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్‌కుమార్ యాదవ్, కోట్ల వెంకటేశ్ వాల్మీకి, నందీశ్వర్, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్: గణేశ్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బాలాపూర్‌లోని గణేశ్ చౌక్ వద్ద వేస్తున్న రోడ్డు పనులను బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహరెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు పరిశీలించారు. గణపతి ఉత్సవాల ఊరేగింపులకు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని ప్రధాన రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను వేయిస్తున్నామని మేయర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, డీఈఈ జ్యోతి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి, బాలాపూర్ గణనాథుని ఉత్సవ కమిటీ సభ్యులు క్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్థలాలను కాపాడాలని వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలాపూర్ వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 18వ డివిజన్‌లోని విజయపురి కాలనీలో ఉన్న 2,200ల గజాల ఓపెన్ ప్లేస్‌ను బాలాపూర్‌కు చెందిన కొందరు కబ్జాదారులు బై నంబర్ల వేసి అన్యాక్రాంతం చేస్తున్నారని, ఆ విలువైన భూమిని కాపాడాలని కోరుతూ పలువురు గురువారం అడిషినల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని అందులో పేర్కొన్నారు. పార్కు కబ్జాలను అడ్డుకొని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తిమ్మని గిరీశ్, గడ్డం వెంకటేశ్, బొర్ర రవి, నీరుడు శ్రీరాములు, పగడాల ఉమేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 సంవత్సరంలో పది చదివిన పూర్వ విద్యార్థులు సందడి చేశా రు. గురువారం పూర్వ విద్యార్థులు మైసిగండి ఆల యం వద్ద చేరుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. తమ కుటుంబ సభ్యులను పరిచయం చే స్తూ ప్రేమతో ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఆ నాటి చిలిపి చేష్టలను స్మరించుకున్నారు.అనంత రం ఆనాటి ఉపాధ్యాయులైన అంబదాసు, చెన్నకేశ వులు, వెంకట్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు గుజ్జరి రాఘవేందర్, ప్రేమ్ కుమార్, సుమన్‌రెడ్డి, పర్వతాలు, పాల్గొన్నారు.

సురక్షిత నీటితో ఆరోగ్యం

తలకొండపల్లి: సురక్షిత మంచి నీటిని తాగడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని లా ఫర్ కా ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ బాయ్ పటేల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్‌లో మహ్మద్ అబీబొద్దీన్ జ్ఞాపకార్థం నిర్మించిన నీటి శుద్ధి కేంద్రంలో జస్మత్ బాయ్ పటేల్ తన సొంత ఖర్చులతో వాటర్ కూలింగ్ మిషన్‌ను ప్రాంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ ఎండీ నయీముద్దీన్ ఆధ్వర్యంలో వాటర్ కూలింగ్ మిషన్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆచార్య రామంజ జీయర్ స్వామి, ఆచార్య కమలా మోహన్‌దాస్, అచ్యుతానంద రామంజ స్వాములు వేద మంత్రాలు చదివి, గోపూజ వైభవంగా నిర్వహించారు.



కందుకూరు: చిప్పలపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు



పహాడీషరీఫ్: ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది

పహాడీషరీఫ్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమిదా అన్నారు. వాదే ముస్తఫా బస్తీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె, మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్‌తో కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మస్రత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎంపీటీసీ సభ్యులు లలితకుమార్, మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాందాస్, ఉపాధ్యాయులు రాజు, పుష్పలత, సుధ, శ్రీరాం, అంగన్‌వాడీ టీచర్ రేణుకను సన్మానించారు. అంతకుముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్ గూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు.అనంతరం విద్యార్థులకు స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుబ్యాంకుగా వాడుకోవడం సరికాదు

- కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పాలకులు ఓటు బ్యాంకుగా రాజకీయాలకు వాడుకొని అభివృద్ధి చేయడం మరిచారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) విమర్శించారు. జల్‌పల్లిలో గురువారం పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న గ్రామంలో డ్రైనేజీ, రహదారుల సమస్య నెలకొనడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలనీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మున్సిపాలిటీకి వెళ్లే ప్రధాన రహదారి పనులు ఇప్పటికే ముగిశాయని, ప్రస్తుతం డ్రైనేజీ పైపులైన్ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయ్యాక అన్ని వీధుల్లో కొత్త రహదారులు వేయించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన గ్రామ శివారులో ప్రైవేట్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ జహంగీర్, కొండల్‌యాదవ్, మస్న రవికుమార్, నవీన్‌గౌడ్, యూసుఫ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



జల్‌పల్లిలోని వీధులను పరిశీలిస్తున్న కేఎల్ఆర్



బడంగ్‌పేట్: విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- సరూర్‌నగర్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బడంగ్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. విద్యార్థులకు తాగటానికి మంచినీరు కూడా అందివ్వడం లేదని, కిటికీలు లేక చలికి వణుకుతున్నారన్నారు. పారిశుద్ధ్య లోపంతో విద్యార్థులు విషజ్వరాలకు గురవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్పందించి వెంటనే గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్ష, తులం బంగారం ఇవ్వాలి:ఎమ్మెల్యే

హుడాకాంప్లెక్స్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో భాగంగా లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన 19 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు ఆసరాగా ఉండాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. గ్యాస్ సబ్సిడీ, 200ల యూనిట్స్ ఉచిత విద్యుత్ దరఖాస్తు చేసిన చాలా మందికి అమలు కావడం లేదని, అలాంటి వారు తన దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తానని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, బీఆర్ఎస్ నాయకులు అరవింద్‌శర్మ, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కొంఢ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల విభజన పూర్తి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని గ్రామాల వారీగా వార్డుల విభజన, ఓటర్ల చేర్పు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు గడిచిన పది రోజులుగా అసెంబ్లీ ఓటర్ జాబితా ప్రకారం ఆయా గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటర్లను విభజించారు. వేర్వేరు వార్డుల్లో ఉన్న కుటుంబసభ్యులను ఒకే వార్డు పరిధిలోకి నమోదు చేశారు. ఈ జాబితాను ఎంపీడీఓ లాగిన్‌లో పొందుపరిచారు. వార్డుల వారీగా విభజనను ఎంపీడీఓ వెంకటమ్మ గురువారం పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డుపై శనివారం పబ్లిష్ చేస్తారన్నారు.



ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటమ్మ

ఏమైన అభ్యంతరాలుంటే ఈ నెల 13లోగా అధికారుల దృష్టికి తీసుకోస్తే వాటిని సవరిస్తామన్నారు. 21వ తేదీన ఓటర్ జాబితా తుది ముసాయిదాను పబ్లిష్ చేయనున్నామన్నారు. ఈ విషయంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్‌పతినాయక్ ఓటర్ జాబితాపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు ఇస్తున్నారు.

‘అర్హులందరికీ రుణమాఫీ’

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులందరికీ రైతు రుణమాఫీ చేస్తామని ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను గురువారం ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ విద్యాధరి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: అర్హులందరికీ మాఫీ చేస్తామని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. సింగంపల్లి, మాలెపల్లి గ్రామాల్లో రైతు కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఈఓలు ప్రబావతి, నిఖిత, భూదేవి పాల్గొన్నారు.

సవరణకు బ్యాంకులను సంప్రదించండి: శ్రీలత

కడ్తాల్: ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లో పేరు వేరుగా ఉంటే రుణమాఫీ కాని రైతులు సంబంధిత బ్యాంకును సంప్రదించి ఆధార్‌ను సరిచేసుకోవాలని ఏవో శ్రీలత సూచించారు. కడ్తాల్, చల్లంపల్లి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ఆధార్, బ్యాంకు అకౌంట్‌లో పేర్లు వేరుగా ఉండటం వల్ల, రుణమాఫీ జాబితాలో పేర్లు రాలేకపోయిన రైతులకు, ఆధార్ సవరణ చేసేందుకు ప్రభుత్వం బ్యాంకులకు అనుమతిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అభినవ్, రమేశ్, కేదార్‌సింగ్, వందన తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్‌లో కుటుంబ నిర్ధారణ సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

పూర్తి వివరాలు అందజేయండి: రవినాథ్

యాచారం: రుణమాఫీ వర్తించని రైతులు పూర్తి వివరాలు అందజేస్తేనే ఆన్‌లైన్‌లో కుటుంబ నిర్ధారణ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామంలో కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

- రాష్ట్ర నాయకుడు డా.ప్రేమ్‌రాజ్‌యాదవ్



మహేశ్వరం: మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రేమ్‌రాజ్‌యాదవ్



మీర్‌పేట: మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

మహేశ్వరం: కేంద్రంలో పీఎం మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతీ కార్యకర్త ఇంటింటికీ తిరిగి తెలియజేసి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డా.ప్రేమ్‌రాజ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరికి తెలియజేసి చైతన్య పరిచి పార్టీ పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమన్నారు. పార్టీ సిద్ధాంతం ప్రకారం ప్రతి ఆరు సంవత్సరాల తర్వాత సభ్యత్వం పునఃరుద్ధరించుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు పార్టీ సభ్యత్వం తీసుకొని ఆయా గ్రామాలు, వార్డుల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి బూత్ నుంచి 200 మందిని సభ్యులుగా సభ్యత్వం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం చేసి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, మండల సభ్యత్వ ఇన్‌చార్జి అయిల్ల యాదయ్యగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిశ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు కాసాని వెంకటేశ్, గిరిజన మోర్చా నాయకుడు దేశ్యానాయక్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాసాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అదిలక్ష్మి, నాయకులు నందీశ్వర్, ముత్యం, సామయ్య, శంకర్, మనోహర్, శ్రీధర్‌రెడ్డి,గోపాల్, రమేశ్, రఘు పలువురు పాల్గొన్నారు.

బీజేపీకి బూత్ కమిటీలే వెన్నుముక: శ్రీవర్ధన్‌రెడ్డి

మీర్‌పేట: బీజేపీకి బూత్ కమిటీలే వెన్నుముక లాంటివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో గురువారం ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశానికి శ్రీవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభమైందన్నారు. 45 రోజుల పాటు నిరంతరంగా సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, నూతన సభ్యత్వం కోసం బీజేపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు 8800002024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు. సాధారణ కార్యకర్త కూడా ప్రధాని, జాతీయ అధ్యక్షుడయ్యే అవకాశం ఒక్క బీజేపీ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా కొనసాగే పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన స్థానిక నాయకుడు సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు గాజుల మధు, కోడూరు సోమేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, సూల ప్రభాకర్, కార్పొరేటర్లు భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, భీంరాజ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, దీని కోసంమట్టి గణపతి ప్రతిమలను పూజించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడాలనే మహా సంకల్పంతో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో గంపలక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా మట్టి గణపతుల ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవులు, వీరేందర్‌గుప్తా, సత్య నారాయణ, రామకృష్ణ, రఘు, రవి, సాయి, హెచ్ఆర్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఎప్పుడో?

ఎనిమిది నెలలుగా మార్కెట్ చైర్మన్ పదవి ఖాళీ

- జనరల్ స్థానానికి రిజర్వుడ్
- చైర్మన్ రేసులో ఇద్దరు కీలక నేతలు
- ఎమ్మెల్యే చుట్టూ నేతల ప్రదక్షిణలు



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి దాదాపు ఎనిమిది నెలలు పూర్తి కావస్తుంది. రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు నేటికీ భర్తీ చేయలేదు. కొన్ని రాష్ట్రా స్థాయిలో చైర్మన్ పదవులు భర్తీ చేశారు. జిల్లా, నియోజకవర్గం స్థాయిలో పదవులు మాత్రం భర్తీ చేయలేదు. రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నం మార్కెట్ పదవీ నియామకంపై ఏ ప్రభుత్వంలోనైనా ఉత్కంఠ నెలకొంటుంది. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎవరినీ వరిస్తుందోనని పట్నం ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్ బనేగా చైర్మన్?

ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీకి రిజర్వుడ్ కావడంతో గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరొందిన ఏర్పుల చంద్రయ్యకు కట్టబెట్టారు. వెంటనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పట్టుమని పది నెలలు గడవక ముందే ఆయనకు పదవీగండం పట్టుకుంది. తదనంతరం అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఆ సీటు అన్‌రిజర్వుడ్‌గా కేటాయించారు. దీంతో ఆశావహుల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలం నుంచి గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలిసింది. కాని మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన రాయపోల్ గ్రామానికి చెందిన మంకాల దాసు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విధేయుడిగా ఉన్నాడు. పార్టీని వీడి తిరిగి వచ్చాడనే అపవాదు తప్ప ఆయనకు ఎమ్మెల్యే ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. మంకాల దాసు కూడా మార్కెట్ చైర్మన్ రేసులో ఉన్నాడు. అంతకు ముందు యాచారం మండలం నందివనపర్తికి చెందిన రాచర్ల వెంకటేశ్వర్లు, ఆరుట్ల గ్రామానికి చెందిన కొంగర విష్ణువర్ధన్‌రెడ్డిలు కూడా పోటీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం మంకాల దాసు, కంబాలపల్లి గురునాథ్‌రెడ్డిలు మాత్రమే రేసులో ఉన్నారు.

బాటసింగారం మార్కెట్ కమిటీ తర్వాతే ప్రకటన

ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గం పేర్లు ఇప్పటికే ఖరారు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే రెండు, మూడు సార్లు ప్రధాన అనుచరులతో కూర్చొని పేర్లు ఫైనల్ చేసినట్లు తెలిసింది. మొత్తం 18 మంది పాలకవర్గం సభ్యులు ఉండగా వారిలో చైర్మన్ రేసులో ఇద్దరు ఉన్నారు. వైస్ చైర్మన్ రేసులో గున్‌గల్ గ్రామానికి చెందిన గజ్జి రామకృష్ణ, రాయపోల్‌కు చెందిన మంకాల కరుణాకర్, తులేకలాన్‌కు చెందిన కోడూరి రమేశ్ పేర్లు తెరపైకి వస్తున్నాయి. పార్టీని నమ్ముకున్న వారికి ఈ పదవీ వరించనుంది. వ్యవసాయ శాఖ నుంచి ఇద్దరు, ఒకరు పీఏసీఎస్ చైర్మన్, మరొకరు మున్సిపల్ చైర్మన్లకు డైరెక్టర్లుగా అవకాశం రానుంది. ట్రేడర్స్ నుంచి కూడా ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించనున్నారు. డైరెక్టర్లుగా కొమరయ్య, శ్రీధర్, భద్రారెడ్డి, శశిధరప్ప, కుమారప్ప, తాళ్ల మహేష్‌గౌడ్, చింతంబాల్‌రాజ్, నీళ్ల చెన్నయ్య, గోపగల్ల సత్తమ్మ, మల్లిక, లింగం, మస్కు నర్సింహల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. బాటసింగారంలో ఉన్నటువంటి పండ్ల మార్కెట్ కమిటీ తర్వాతే ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నియామకం చేయనున్నట్లు తెలుస్తోంది.

ఈ సారైన ఎస్సీలకు న్యాయం జరిగేనా?

గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఓ ఎస్సీ నాయకుడు తనకే మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలని నిరసనలు వ్యక్తం చేశాడు. అయిన ఆయనకు కేటాయించకుండా గురునాథ్‌రెడ్డికి కట్టబెట్టారు. మళ్లీ అదే సీటును రెండో సారి కూడా గురునాథ్‌రెడ్డి పేరు బాహాటంగా వినిపిస్తుంది. ఈ సారైన ఎస్సీ సామాజిక వర్గానికి కట్టబెట్టి సామాజిక న్యాయం చేస్తారో వేచి చూడాలి.